సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025

హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు



న్యూస్‌రీల్

నా సినిమాలో నిరసన సన్నివేశాలు

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: తాను తీస్తున్న సినిమాలో ఒక కలెక్టర్‌కు వ్యతిరేకంగా తాను చేసిన ధర్నాలు, రాస్తారోకోలు.. కలెక్టర్ బదిలీ అయ్యే వరకు చేసిన నిరసనలకు సంబంధించిన సన్నివేశాలు ఉంటాయని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మీడి యాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ఈ సినిమాలో తన ప్రేమ కథ ఉండదని, ప్రేమ జంటకు అండగా నిలిచే పాత్రలో తాను నటిస్తున్నానని చెప్పారు. గతంలో తనపై పోలీసులు చేసిన ఒత్తిడిలు, నిర్బంధాలు, ఎస్పీతో జరిగిన వాగ్వాదాలు కూడా ఉంటాయని ఆయన వివరించారు.

ట్యాంకర్‌ల ద్వారా నీటి సరఫరా



డబుల్‌బెడ్ రూం కాలనీలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో నీటి సమస్య నెలకుంది. మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించడంలేదని వారు సమ్మెకు దిగారు. పట్టణంలో నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు బిందెడు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని పలు కాలనీలో బోరుమోటారు లేవు. కేవలం మిషన్‌భగీరథ నీటిపైనే ప్రజలు ఆధారపడి ఉన్నారు. తాడగానికి వాటర్ క్యాన్‌లు కొనుగోలు చేస్తుండగా.. ఇంటి అవసరాల నీళ్ల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సమస్యపై ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ అధికారులు తాత్కాలికంగా సమస్య పరిష్కారం కోసం సోమవారం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాలకు చెక్

న్యాయమూర్తి భవానీ చంద్ర



అగ్నిమాపక అధికారులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవానీచంద్ర

సంగారెడ్డి క్రైమ్: అవగాహన ఉంటే అగ్ని ప్రమాదాలను చాలావరకు నివారించవచ్చని జిల్లా న్యాయమూర్తి భవానీ చంద్ర అన్నారు. సంగారెడ్డిలో అగ్నిమాపక దళ వారోత్సవాలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రజలకు ప్రమాదాలు నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా వారోత్సవాలు నిర్వహించినట్లు పట్టణ అగ్నిమాపక కేంద్రం ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. తొలుత 1944లో ముంబై డాక్యార్డ్స్‌లో అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 66 మంది సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం అగ్నిమాపక అధికారులతో కలిసి వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

'రన్ ఫర్ ' అంబేడ్కర్



రన్ ఫర్‌లో పాల్గొన్న నాయకులు

సంగారెడ్డి జోన్: బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డిలో రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం ఐబీ నుంచి పాత బస్టాండ్ వరకు నిర్వహించగా జిల్లా అదనపు ఎస్పీ సంజీవ్ రావు 'రన్ ఫర్'ను జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొండాపురం జగన్, యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు రూ.62.28 కోట్లు



నిధుల విడుదలలో జాప్యం
- రెండు నెలలుగా రాని మెటీరియల్ కాంపోనెంట్ నిధులు
- కూలీల డబ్బులు కూడా కొందరికి రాలె..
- త్వరలోనే విడుదల అవుతాయంటున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఉపాధి హామీ పథకం నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రావడంలో ఆలస్యమవుతోంది. కొందరు ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన డబ్బులు కూడా కొంత మేరకు పెండింగ్‌లో ఉంది. మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లాలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు, నిర్దేశించిన పలు అభివృద్ధి పనులు కూడా చేపట్టారు. అయితే ఈ పనులకు సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ నిధు లు నిలిచిపోయాయి. నిబంధనల ప్రకారం పక్షం రోజుల్లో కూలీలకు డబ్బులు చెల్లించాలి. కానీ కొందరికి దాదాపు రెండు నెలలుగా కూలీ డబ్బులు రాలేదు. చేసిన పనికి సకాలంలో కూలీ చేతికందకపోవడంతో వారు నిరాశ చెందుతున్నారు. మండే ఎండలను సైతం లెక్క చేయకుండా కూలీలు ఈ పనులకు వెళుతున్నారు. కానీ చేసిన కష్టం చేతికందడంలో జరుగుతున్న జాప్యం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.62.28 కోట్ల మేరకు బకాయిలు

జిల్లాలో మొత్తం 2.19 లక్షల జాబ్ కార్డులు ఉండగా, 4.02 లక్షల మంది కూలీలు ఉన్నారు. ఇందులో రెగ్యులర్‌గా ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు 2.09 లక్షల మంది ఉంటారు. అయితే ఈ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద కొన్ని రకాల అభివృద్ధి పనులు చేస్తుంటారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల విడుదలలో సుమారు రెండు నెలలుగా జాప్యం జరుగుతోంది. అలాగే కూలీలకు చెల్లించాల్సిన డబ్బులు కలిపి మొత్తం రూ.62.28 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇందులో గత ఆర్థిక సంవత్సరం 2024–25లో మార్చి 31 వరకు రూ.61.89 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ నిధులు పెండింగ్‌లో ఉండగా, రూ.20 లక్షల వరకు కూలీలకు చెల్లించాల్సిన కూలీ డబ్బులు రాలేదు. ఈ నెల ఏప్రిల్ మాసానికి సంబంధించి కూడా మెటీరియల్ కాంపోనెంట్, కూలీ డబ్బులు కలిపి రూ.18 లక్షలు రావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఈ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. త్వరలోనే ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేస్తుందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడం, కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం అయిన నేపథ్యంలో జాప్యం జరిగి ఉండవచ్చని చెబుతున్నారు.

మూడు నెలలుగా ఎదురు చూస్తున్నాం



మూడు నెలల నుంచి కూలీ డబ్బులు చెల్లించడం లేదు. 15 రోజులకు డబ్బులు చెల్లించాలి కానీ.. అలా జరగడం లేదు. డిసెంబర్లో చేసిన పనులకు గాను మొన్న వారం రోజుల డబ్బులు చెల్లించారు. పెండింగ్ కూలీ డబ్బుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వీలైనంత త్వరగా కూలీ డబ్బులు చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–విఠల్, ఉపాధి హామీ కూలి, మొగుడంపల్లి

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు



సంగారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అదనపు కలెక్టరు చంద్రశేఖర్, ఎస్పీ పరితోష్ పంకజ్, నిర్మలారెడ్డి తదితరులు

సంగారెడ్డి జోన్: సామాజిక వివక్ష లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేసి ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అభివృద్ధి అధికారి అఖిలేష్ రెడ్డి, ఎస్సీ ఈడీ కార్పొరేషన్ అధికారి రామాచారి, బీసీ అభివృద్ధి అధికారి జగదీష్, గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, డీఎస్పీ సత్తయ్య గౌడ్, జిల్లా అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలందరికి సమాన హక్కులు కల్పించారు: ఎమ్మెల్యే హరీశ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చీకట్లో ఉన్న వారికి వెలుగును చూపిన మహనీయుడు అంబేడ్కర్ అని సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, రమేష్, నర్సింహా పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడుదాం: ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. సోమవారం జహీరాబాద్‌లో అంబేడ్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వారు పాల్గొన్నారు. అనంతరం హోతి(బి)లో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బి.నర్సయ్య, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, ఎంపీ కార్యాలయ పార్లమెంట్ ఇంచార్జి జి.శుక్లవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్, చిత్రంలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ తదితరులు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

బీజేపీ నేతలను పరామర్శించిన మెదక్ ఎంపీ రఘునందన్

హత్నూర (సంగారెడ్డి): అకారణంగా కేసులు పెట్టి జైల్లో పెట్టినంతమాత్రాన అధైర్య పడొద్దని, తాను అండగా ఉంటానని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సోమవారం సాయంత్రం హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్‌లో ఇటీవల ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఆరు మంది బీజేపీ నాయకులపై కేసు పెట్టి రిమాండ్‌కు తరలించారు. అయితే.. బాధిత కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించారు. రాజకీయ కక్షతో కొంతమంది నాయకులు బీజేపీ నేతలపై అకారణంగా దాడి చేసి, పైగా పోలీసుల చేత అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని, అయినా భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఆఖరుకు న్యాయమే గెలుస్తుందని, జైలు నుంచి విడిపించేందుకు అవసరమైతే హైకోర్టును సైతం ఆశ్రయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు నాగప్రభుగౌడ్, నాయకులు సంఘసాని సురేష్, రమేష్ గౌడ్, సతీష్, గ్రామ బిజెపి నాయకులు పాల్గొన్నారు.



హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్లో బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ రఘునందన్ రావు

భూ భారతితో మెరుగైన సేవలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భూ భారతి పోర్టల్‌తో రైతులకు మెరుగైన సేవలు అందుతాయని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. భూ భారతి పోర్టల్ ఆవిష్కరణ నేపథ్యంలో సోమవారం మండలంలోని మద్దికుంట రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు.

మల్లన్న సన్నిధిలో కాత్యాయని దేవి

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామిని ఐఏఎస్ అధికారి, స్టేట్ ఫైనాన్షియల్ రీజినల్ మేనేజింగ్ డైరెక్టర్ కాత్యాయని దేవి కుటుంబసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదం, శేషా వస్త్రాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్,ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



కాత్యాయని దేవికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

సుడిగాలి బీభత్సం

- భక్తులపై కూలిన టెంట్లు.. 30 మందికి గాయాలు
- సిర్గాపూర్ మండలం వాసర్‌లో ఘటన
- నాన్‌జీధామ్ జగద్గురు నరేంద్రచార్యా పాదుకా దర్శనంలో అపశ్రుతి

కంగ్టి/కల్హేర్(నారాయణఖేడ్): సుడిగాలి బీభత్సం సృష్టించింది. టెంట్లు కూలి 30 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారంసిర్గాపూర్ మండలం వాసర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకొంది. మహారాష్ట్రలోని నాన్‌జీధామ్‌కు చెందిన జగద్గురు నరేంద్రచార్య మహారాజ్ పాదుకా దర్శనం కార్యక్రమం కొనసాగుతుండగా ఈ ఘటన జరిగింది. టెంట్ కట్టెలు, పైపులు, లౌడ్ స్పీకర్లు కూలాయి. భయాందోళనతో భక్తులు బయటకు పరుగెత్తే ప్రయత్నంలో కొంత తోపులాట జరిగినట్లు స్థానికులు తెలిపారు. కాగా, 108 అంబులెన్స్‌లో గాయాలపాలైన వారికి నారాయణఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయాల పాలైన వారిలో సుక్కల్‌తీర్థ్ శాంతాబాయి(60), బిరాదర్ రాజేందర్(62), పోచాపురం మొగులయ్య(40), మేత్రి కమల(50), సుక్కల్‌తీర్థ్ మోతిబాయి(55), మారేపల్లి కౌంసల్య(40), బిరాదర్ సవితాబాయి(40), పరాలే పద్మినిబాయి(44), సుర్నార్ సిద్దమ్మ(35), జాదవ్ రాజు(55), మల్కపూర్ అనూషాబాయి(60) ఉన్నారు. అక్కడి నుంచి కొందరు ఇతర ఆసుపత్రులకు సైతం చికిత్స నిమిత్తం వెళ్లినట్లు సమాచారం. కాగా తీవ్రంగా గాయాలపాలైన నలుగురిని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు.



చికిత్స పొందిన క్షతగాత్రులు

ఉత్తమ వైద్యం అందిస్తాం

పాదుకా దర్శనంలో గాయాలపాలైన వారికి ఉత్తమ చికిత్స కోసం తనవంతు సాయం అందజేస్తానని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ భరోసా ఇచ్చారు. సీటీ స్కానింగ్ అవసరమైతే అందుబాటులో ఉన్న ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేయించాలని మాజీ ఎంపీ సూచించారు.



గాయపడిన భక్తులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్ గ్రామంలో శ్రీ నరేంద్ర మహారాజ్ పాదుకల పూజ కార్యక్రమంలో ఈదురు గాలులతో టెంట్లుకూలి గాయపడిన బాధిత భక్తులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆస్పత్రిలో బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నాయకులు, ఉన్నారు. వినోద్‌పాటిల్, శివాజీపాటిల్, జైవంత్‌పాటిల్, బాబురావు, విఠల్‌రెడ్డి, ప్రకాష్‌రావు ఉన్నారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు అరుణ్ శేరికార్, మారుతిరెడ్డి, రామకృష్ణ, రాజశేఖర్‌గౌడ్, సగుణాకర్, సాయేందర్, ఈశ్వరప్ప తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

శిక్షణతో.. భవిష్యత్తుకు పునాది

- ఉపాధి పొందుతున్న యువత
- ఎస్బీఐ సౌజన్యంతో వ్యాపార రుణాలు
- 11,545 మందికి ఉచిత శిక్షణ పూర్తి
- లబ్ధి పొందుతున్న నిరుద్యోగులు

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు శిక్షణతోపాటు ఉపాధి కల్పిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది సంగారెడ్డిలోని గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వారిని ఉన్నత స్థానంలో ఉంచాలనే లక్ష్యంతో ఈ సంస్థ 2010లో జూన్ 7న ఏర్పాటు చేయగా నాటి నుంచి ఎస్బీఐ సౌజన్యంతో యువతీ, యువకులకు ఉపాధి కల్పించే అనేక రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. సంస్థ ద్వారా ఇప్పటివరకు 435 బ్యాచ్‌లకు శిక్షణ కల్పించి ఎంతోమంది ఉపాధికి బాటలు వేశారు. శిక్షణతోపాటు ఉచితంగా భోజనం, వసతి కల్పించడమే కాకుండా వ్యాపార రుణాలను సైతం మంజూరు చేస్తోంది. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న నిరుద్యోగ యువతకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ అండగా నిలుస్తూ ఉపాధి కల్పిస్తుండడంతో ఈ శిక్షణ కేంద్రంపై నిరుద్యోగ యువత ఎంతో ఆసక్తి చూపుతోంది. దీంతో రోజురోజుకు దీనికి ఎంతో ఆదరణ పెరుగుతుంది.

సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు గత 15 ఏళ్లుగా మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్, మగ్గంవర్క్, కంప్యూటర్ శిక్షణతోపాటు ఇటీవల ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణ అందిస్తుండగా పురుషులకు మోటార్ వెహికల్ మెకానిక్, సెల్ ఫోన్ రిపేరింగ్, సీసీ టీవీ, ఫొటోగ్రఫీ, కెమెరా ఇన్‌స్టాలేషన్ శిక్షణతోపాటు ఉచితంగా వసతి, భోజనం సదుపాయం కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. క్రమశిక్షణతో కూడిన ట్రైనింగ్ సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుండటంతో గ్రామీణ నిరుద్యోగ యువత శిక్షణ తీసుకునేందుకు తరలివస్తున్నారు.


30 రోజులపాటు శిక్షణ

2010 జూన్ 7న ప్రారంభమైన ఈ శిక్షణ సంస్థ ద్వారా ఇప్పటి వరకు 11,545 శిక్షణ తీసుకోగా అందులో 8,116 మంది స్వయం ఉపాధిలో స్థిరపడ్డారు. 3,303 మందికి బ్యాంకుల ద్వారా రుణాలను అందించారు. 834 మంది వివిధ సంస్థలలో ఉద్యోగాలు చేస్తున్నారు. శిక్షణలో భాగంగా వ్యక్తిత్వ వికాసం, వ్యాపార సంబంధ బ్యాంకింగ్ విషయాలపై సైతం అవగాహన కల్పిస్తున్నారు. ఉచిత భోజనం, ఉచిత నివాసం ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తుంది. 30 రోజులపాటు ఈ శిక్షణ ఇస్తారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను అందజేస్తారు.



గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ లో ఉచితంగా శిక్షణ పొందుతున్న మహిళలు


సొంతంగా బైక్ మెకానిక్ షాప్ పెట్టుకున్న



స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఉచితంగా బైక్ మెకానిక్‌లో శిక్షణ పొంది అనంతరం సొంతంగా గ్రామంలోనే మెకానిక్ షాప్ పెట్టుకుని ఉపాధి పొందుతున్నాను. నెలకు రూ.35 వేల వరకు సంపాదిస్తూ నాతో పాటు మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నాను.

–సురేశ్, మునిపల్లి మండలం కంకోల్ గ్రామం


కుటుంబానికి ఆసరాగా నిలుస్తా



గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ద్వారా ఉచితంగా కుట్టు మెషీన్ శిక్షణ తీసుకుంటున్నాను. శిక్షణ అనంతరం ఎస్బీఐ ద్వారా రుణం పొంది సొంతంగా కుట్టు మెషీన్ ప్రారంభించి కుటుంబానికి ఆసరాగా ఉంటాను.

–అర్చన, మెదక్ జిల్లా, టేక్మాల్ మండలం, సూరంపల్లి


బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న



న్యూస్ పేపర్లో వచ్చిన ఉచిత శిక్షణ ప్రకటనను చూసి సంగారెడ్డి స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాను. ఆ తర్వాత ఉచితంగా హాస్టల్లో ఉంటూ బ్యూటీషియన్లో శిక్షణ పొందాను. ప్రస్తుతం సంగారెడ్డిలో పార్లర్ నడుపుతున్నాను. నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు సంపాదిస్తున్నాను. మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నాను.

–అశ్విని రాథోడ్, విట్టు నాయక్ తండ, మొగుడంపల్లి మండలం

11,545 మంది ఉచిత శిక్షణ పొందారు



గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణతోపాటు బ్యాంకు ద్వారా రుణాలను కల్పిస్తున్నాం. ఉచిత వసతితోపాటు వ్యాపారాలకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. శిక్షణ ఇవ్వడంతోపాటు సొంతంగా ఉపాధి పొందేందుకు అవకాశాలు కల్పిస్తున్నాం. ఇటువంటి అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

– రాజేంద్ర ప్రసాద్, గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ డైరెక్టర్

క్లుప్తంగా

అధ్యాపకుడికి ప్రతిభా అవార్డు



అవార్డును అందుకుంటున్న వైకుంఠం, పక్కన మంత శ్రీనివాస్, ఆదినారాయణ

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ వైకుంఠం కళారంగంలో చేసిన సేవలకుగాను సౌత్ ఇండియన్ కల్చరల్ ఫెస్టివల్స్ ఉగాది పురస్కారాల్లో భాగంగా అవార్డును అందుకున్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కల్చరల్ ఫైన్ఆర్ట్స్ ఫెడరేషన్ హైద్రాబాద్, ఆదిలీలా ఫౌండేషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో అక్కడి లోక్ కళామంచ్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందించినట్లు చెప్పారు. ఐటీ శాఖ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు, సినీ నిర్మాత మంత శ్రీనివాస్, ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ఆది ఫౌండేషన్ చైర్మన్ ఆది నారాయణ, సీనియర్ కూచిపూడి నాట్యగురు సీతనాగజ్యోతి తదితరులు చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని కళామతల్లి సేవలో రెట్టించిన ఉత్సాహంతో పాల్గొంటానన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ పిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సీఈఓ డాక్టర్ గోపాలసుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రద్ధానందం, ఇన్‌చార్జి పీడీ విశ్వనాథం తదితరులు వైకుంఠంను అభినందించారు.

చర్చలతోనే సమస్యలు పరిష్కారం

– అరుణోదయ సాంస్కృతిక నాయకురాలు విమలక్క



సహదేవ రెడ్డి కుటుంబ సభ్యులతో విమలక్క

హుస్నాబాద్: పీపుల్స్‌వార్ చర్చలకు ముందుకు రావడం, ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే ఇరుపక్షాల చర్చలతో సమస్యలు పరిష్కామవుతాయని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క అన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలో జనశక్తి నాయకుడు రిక్కల సహదేవ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కొద్ది సేపు మాట్లాడారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో సహదేవ రెడ్డి అమరుడయ్యాడని తెలిపారు. తాను ఏదైతే సమ సమాజం కోసం కలలు కన్నాడో దాని కోసం పోరాడటమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అన్నారు. కలలు నెరవేర్చడానికి పౌర సమాజం ఆ దిశగా ఆలోచించాలన్నారు. ముంచుకొస్తున్న ఫాసిజానికి వ్యతిరేకంగా విశాల దృక్పథంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయేందుకు కృషి జరగాలన్నారు. మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరిపేందుకు ముందుకురాలని అన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల పరిధిలోని రంగాయపల్లి గ్రామంలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దానప్ప సత్యనారాయణ బంధువుల పెళ్లి నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. సోమవారం ఇంటికొచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని అరతులం బంగారం, ఆరు తులాల వెండి, రూ.80 వేల నగదు కనిపించలేదు. దొంగలు చోరీ చేసినట్లు గుర్తించి మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

తడిసిన ధాన్యం.. రైతుల దైన్యం



కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని పలు గ్రామాలలో సోమవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొన్ని చోట్ల వడగళ్లు కురవడంతో వరి పంట దెబ్బతింది. మండలంలోని వల్లంపట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు.



వినియోగించకుండా పడేసిన బెడ్స్, పేరుకుపోయిన చెత్తా చెదారం



మరమ్మతులేని వాటర్ ప్యూరిఫైడ్‌మిషన్

వసతి.. ఇదీ దుస్థితి



కొడిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్

- సమస్యల వలయంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్
- ఫ్యాన్లు తిరగవు లైట్లు వెలగవు
- పాడైన వాటర్ ప్యూరీఫైడ్ మిషన్
- చిరిగిన బెడ్ షీట్స్, వృథాగా మంచాలు
- భోజనంలో వెంట్రుకలు, మళ్లీ పెట్టమంటే తిట్లు



గదిలో లేని ట్యూబ్‌లైట్, ఫ్యాన్

కొడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహం సమస్యలకు నిలయంగా మారింది. దూరం ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చిన వారిని అసౌకర్యాలు వెంటాడుతున్నాయి. భోజనంలో వెంట్రుకలు వస్తాయి.. ఇంకొంచం పెట్టమంటే పెట్టరు. ఫ్యాన్లు తిరగవు లైట్లు వెలగవు. చిరిగిపోతున్న బెడ్లు, వృథాగా మంచాలు పడి ఉన్నాయి. అయినా ఎవరూ పట్టించుకోరు. దీంతో విద్యార్థులు అరకొర వసతుల మధ్యే కొంటూ తమ చదువులు కొనసాగిస్తున్నారు.

కొడిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ కావడంతో సాక్షి విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగు చూశాయి. వసతి గృహంలో మొత్తం 154 మంది విద్యార్థినీలు ఉన్నారు. వార్డెన్ నర్సమ్మతోపాటు కుక్, వాచ్‌మెన్, కామాటీ విధులు నిర్వహిస్తున్నారు. పదవ తరగతి విద్యార్థులు 34 మంది పరీక్షలు పూర్తి అవడంతో ఇటీవల వెళ్లిపోయారు. 23 మంది విద్యార్థులు గైర్హాజరు కావడంతో ప్రస్తుతం 97 మంది వసతి గృహంలో ఉంటున్నారు. కాగా, ఉదయం టిఫిన్‌తోపాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం సరిగా వండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. భోజనంలో వెంట్రుకలు వస్తున్నాయని, నీళ్ల చారు ఇష్ట మొచ్చినట్లు వండుతున్నారని చెబుతున్నారు. రెండు నెలలుగా గుడ్డుపెట్టడంలేదని వాపోతున్నారు. హాస్టల్ సిబ్బందికి మంచి భోజనం వండుకొని తమకు మాత్రం ఇష్టం వచ్చినట్లు వండి పెడుతున్నారని ఆరోపించారు. మరోసారి భోజనం పెట్టాలని వెళ్తే సిబ్బంది తిడుతున్నారని చెప్పారు.

వర్కర్‌లు లేక ఇబ్బంది

వసతి గృహంలో వర్కర్లు లేక సామగ్రిని వాడటంలేదు. భోజనం మంచిగా చేసేందు చర్యలు తీసుకుంటాం. సెలవులు పూర్తి అయిన తర్వాత అన్నింటినీ వినియోగంలోకి తీసుకొచ్చి విద్యార్థులకు సౌకర్యం కల్పిస్తాం.

– నర్సమ్మ, వార్డెన్

వృథాగా మంచాలు, డైనింగ్ టేబుల్స్

వసతి గృహంలోని గదుల్లో ఫ్యాన్లు తిరగడం లేదు. లైట్లు వెలగడంలేదు. ఇక్కడి సమస్యలు ఎవరికైనా చెబితే హాస్టల్ సిబ్బంది ఇబ్బందులు పెడతారని వాపోయారు. అలాగే, వసతి గృహంలో విద్యార్థుల సౌకర్యం కోసం రూ.లక్షలు వెచ్చించి మంచాలు, టేబుల్స్ కొనుగోలు చేసినా వినియోగించడం లేదు. దీంతో విద్యార్థులు కిందనే పడుకుంటున్నారు. కొత్త మంచాలు స్టోర్‌రూంలో పడేసి పాడైపోయేలా చేస్తున్నారు. బెడ్ షీట్స్ సైతం వాడకపోవడంతో చిరిపోతున్నాయి. దీనికితోడు విద్యార్థులు డైనింగ్ స్టీల్ మెటీరియల్ టేబుల్స్, బెంచీలు డైనింగ్ హాల్‌లో వాడకుండా పడేశారు. విద్యార్థులు కింద కూర్చొని భోజనం చేస్తున్నారు. రక్షిత మంచి నీటి పథకం ప్యూరీఫైడ్ మిషన్ పాడైపోయి ఏడాది గడిచినా బాగు చేయించలేదు. విద్యార్థులకు ఇచ్చిన డ్రెస్‌లు సైతం ఇవ్వకుండా మూలన పడేశారు.



చిరిగిపోతున్న బెడ్స్

భార్యను రోకలి బండతో కొట్టి చంపిన భర్త

- కాపురానికి రావడం లేదని ఘాతుకం
- అడ్డొచ్చిన అత్తపై దాడి
- పటాన్‌చెరు మండలంలో ఘటన



రమీలా(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భార్య కాపురానికి రావడం లేదని ఆగ్రహించిన భర్త రోకలి బండతో కొట్టి చంపాడు. అడ్డొచ్చిన అత్త పై దాడి చేయడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వినాయక రెడ్డి కథనం మేరకు.. జిన్నారం మండలం కిష్టాయిపల్లికి చెందిన సురేశ్‌కి పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామానికి చెందిన రమీలా(24)తో ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల పాప ఉండగా పటాన్‌చెరు మండలం ఇంద్రేశం సాయి కాలనీలో ఉంటున్నారు. సురేశ్ ఓ ప్రైవేటు వెంచర్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. తరుచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో రమీలా పాపను తీసుకొని పెద్ద కంజర్లలోతల్లిగారింటికి వెళ్లింది. కాపురానికి రమ్మంటే రావడం లేదని సోమవారం అత్తగారింటికి వచ్చి భార్యతో సురేశ్ గొడవ పడ్డాడు. ఈ క్రమంలో కోపోద్రేకుడై రోకలి బండతో భార్యపై దాడి చేయగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డువచ్చిన అత్తపై దాడి చేయగా ఆమెకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకొని ఎస్ఐ వెంకట్ రెడ్డితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించాం. మృతురాలి సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేశ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహనీయుడా.. మన్నించు

– దాత పేరు లేదని విగ్రహావిష్కరణ వాయిదా



బోసిపోయిన దిమ్మె

పాపన్నపేట(మెదక్): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో అపశ్రుతి చోటు చేసుకుంది. విగ్రహ దాత తన పేరు పెట్టాలన్న డిమాండ్ ఆవిష్కరణకు బ్రేకులు వేసింది. వివరాల్లోకి వెళ్తే.. పాపన్నపేటలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించాలని గ్రామంలోని మూడు యువజన సంఘాలు సంకల్పించాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన దాత విగ్రహం వితరణ చేయడానికి ముందుకొచ్చాడు. ఈ మేరకు యువజన సంఘాలు మండల కాంప్లెక్స్ సముదాయం ముందు సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేసి గద్దె నిర్మించారు. అనుకున్న ప్రకారం వారం రోజుల కిందట విగ్రహం వచ్చింది. ముసుగు వేసి గద్దెపై ఉంచారు. మంగళవారం ఓ ప్రజా ప్రతినిధి చేతుల మీదుగా విగ్రహం ఆవిష్కరించాలనుకున్నారు. విగ్రహం ప్రతిష్ఠించే గద్దెపై తన పేరు ఉండాలని దాత డిమాండ్ చేశాడు. యువజన సంఘాలు ఇందుకు ససేమీర అనడంతో విగ్రహాన్ని వెనక్కి తీసుకెళ్లారు. బోసిపోయిన గద్దెను చూసి మండల ప్రజలు అవాక్కయ్యారు.

ఫ్లెక్సీ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



ఆస్పత్రి వద్ద తొలగించిన ఫ్లెక్సీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రి ఎదుట ఓ ప్రైవేటు ఆస్పత్రికి చెందిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, చలివేంద్రం చాటున ప్రైవేట్ ప్రచారం పేరుతో సోమవారం ''సాక్షి''లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారులు స్పందించారు. వెంటనే వైద్యాధికారులు సిబ్బందితో ఫ్లెక్సీని తొలగించారు. ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన ఫ్లెక్సీలు, ప్రచారానికి సంబంధించినవి ఏర్పాటు చేయకూడదని, మరోసారి ఇలాంటివి పునరావృతం కాకూడదని వైద్యాధికారులు సిబ్బందికి సూచించినట్లు సమాచారం. ప్రైవేటు ఆస్పత్రులకు ఎవరినైనా రెఫర్ చేసినట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం

పనికని వెళ్లి యువతి



నాగలక్ష్మి

మనోహరాబాద్(తూప్రాన్): యువతి అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మండలంలోని కాళ్లకల్ గ్రామంలో నివాసముంటున్న చామంతుల గణేశ్, మంజులకు కూతురు నాగలక్ష్మి(19), కుమారుడు ఉన్నారు. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. నాగలక్ష్మి 10 రోజుల నుంచి మేడ్చల్ మండలంలోని అత్వెల్లి గ్రామ పరిధిలోని నేషనల్ మార్ట్‌లో పనికి వెళ్తుంది. 12న ఉదయం పనికి వెళ్లిన యువతి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సికింద్లాపూర్‌లో గృహిణి



సునీత

శివ్వంపేట(నర్సాపూర్): గృహిణి అదృశ్యమైన ఘటన మండల పరిధి సికింద్లాపూర్ పంచాయతీ పిట్టలవాడలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. పిట్టలవాడకు చెందిన సునీత 6న ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు గ్రామ పరిసరాలు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం సునీత భర్త సురేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

– సంగారెడ్డిలో యువకుడు, గృహిణి

సంగారెడ్డి క్రైమ్: ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. మెదక్ జిల్లా రంగంపేట మండలానికి చెందిన ఎరుపుల వెంకట్ (37) బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసి ఏడాది కిందట పట్టణంలోని శాంతినగర్‌కి వచ్చి మేస్త్రీగా పని చేస్తూ జీవిస్తున్నారు. గత నెల 28న దంపతులు గొడవ పడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన వ్యక్తి అదే రోజు ఇంట్లోంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం సాయంత్రం భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



సరళ

గృహిణి అదృశ్యమైన ఘటన సంగారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పుల్‌కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బేగరి ప్రసన్న కుమార్, సరళ భార్యాభర్తలు. సరళ (30) భర్తతో గొడవపడి 11న నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో వివాదం

- శిలాఫలకంపై పేర్లు ఉన్నాయని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం
- చివరకు శిలాఫలకంపై రంగు



విగ్రహావిష్కరణ వద్ద ఉద్రిక్త వాతావరణం

కొమురవెల్లి(సిద్దిపేట): అంబేడ్కర్ జయంతి రోజు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ వివాదాస్పదమైంది. వివరాల్లోకి వెళ్తే.. కొమురవెల్లి మండల కేంద్రంలో గోషాల సమీపంలో వైజంక్షన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు, మాల సామాజిక వర్గానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, మాజీ ఎంపీపీ తలారి కీర్తన కిషన్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. గ్రామంలో 40 ఏళ్ల కిందటే అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, కొంత మంది వ్యక్తులు తమకు చెప్పకుండా ప్రభుత్వ భూమిలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని దళిత సామాజిక వర్గానికి చెందిన కొందరు ఎంపీడీవో శ్రీనివాస వర్మ, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆవిష్కరణ నిలిపివేయాలన్నారు. వారి మాట వినకుండా సిద్దప్ప, కీర్తన కిషన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కొంత మంది కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు అక్కడికి చేరుకోవడంతో సీఐ శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు మోహరించడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకంపై కొందరి పేర్లు మాత్రమే ఉన్నాయని, శిలాఫలకం తొలగించాలని కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇరువర్గాలతో మాట్లాడి శిలాఫలకానికి రంగు వేయడంతో సమస్య సద్దు మనిగింది. అనంతరం కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు అంబేడ్కర్‌కు పూల మాలలు వేసి నివాళులర్పించారు.



శిలాఫలకంపై రంగు

కుమారుడితో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

చెరువులోకి వెళ్తుండగా కాపాడిన పోలీసులు



బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు

నర్సాపూర్ : కుమారుడితో కలిసి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరిని కాపాడారు. ఎస్ఐ లింగం కథనం మేరకు.. నర్సాపూర్‌కు చెందిన మన్నె జయమ్మ సోమవారం నాలుగేళ్ల కుమారుడితో కలిసి స్థానిక రాయరావు చెరువు వద్దకు వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చెరువులో దిగి నీటి లోపలికి వెళ్తుండగా వాచ్‌మెన్ రమేశ్ గమనించి విషయాన్ని పోలీసులకు చెప్పాడు. పోలీసు హెడ్ కానిస్టేబుల్ పాండరి, కానిస్టేబుల్ భిక్షపతి, యాదయ్య, నాగరాజు వెంటనే చెరువు వద్దకు వెళ్లి తల్లి కుమారుడిని నీటిలోంచి బయటకు తెచ్చి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుటుంబ కలహాలతోనే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవాలని జయమ్మ నిశ్చయించుకుందని ఎస్ఐ తెలిపారు. అనంతరం జయమ్మ భర్త అనిల్‌కుమార్‌ను స్టేషన్‌కు పిలిపించి భార్యాభర్తలిద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపిచారు. తల్లికుమారుడిని కాపాడిన సిబ్బందిని ఎస్ఐతోపాటు పలువురు అభినందించారు.

ప్రాణం తీసిన అతి వేగం

- స్నేహితులను కలిసేందుకు వెళ్తుండగా..
- అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి కారు బోల్తా
- యువకుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలంలోని మర్పడ్గ శివారులో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. త్రీ టౌన్ పోలీసుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని గండివేటు గ్రామానికి చెందిన నామాల అనిల్ (24) హైదరాబాద్‌లోని బోడుప్పల్ ఉంటూ హోటల్‌లో పని చేస్తున్నాడు. బాన్సువాడ మండలంలోని దేశాయిపేటకు చెందిన సాయిబాబ(24) హైదరాబాద్‌లోనే ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అనిల్, సాయిబాబ ఇద్దరూ స్నేహితులు కాగా గతంలో వీరు సిద్దిపేటలోని బీజేఆర్ చౌరస్తాలో గల ఓ హోటల్‌లో పని చేశారు. ఆ సమయంలో వీరికి అక్కడ కొందరు స్నేహితులు అయ్యారు. వారిని చూసేందుకు ఆదివారం రాత్రి బోడుప్పల్ నుంచి కారులో అనిల్, సాయిబాబ బయలు దేరారు. రాజీవ్ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా రుసుం తప్పించుకోవడానికి మర్పడ్గ మీదుగా సిద్దిపేటకు వెళ్తున్నారు. మర్పడ్గ శివారులో కారు అతి వేగంగా వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనిల్ తలకు తీవ్ర గాయాలై కారులోనే ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిబాబకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు చూసి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఇద్దరినీ సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి అంజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొని వ్యక్తి..

సంగారెడ్డి : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన అకోలా నాందేడ్ రహదారిపై శివ్వంపేట శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పుల్కల్ ఎస్ఐ క్రాంతి కుమార్ పాటిల్ కథనం మేరకు.. ఓ లారీ సంగారెడ్డి వైపు నుంచి జోగిపేట వైపు వెళుంది. అలాగే అల్లాదుర్గం మండలం చేవెళ్ల గ్రామానికి చెందిన జర్నయ్య (43) బైక్‌పై జోగిపేట వైపే వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న లారీని ఓవర్ టెక్ చేసే క్రమంలో కుడి వైపు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి



ప్రభాకర్ (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. శేరిలింగంపల్లి పరిధిలోని నేతాజీనగర్‌కు చెందిన ప్రభాకర్(55) క్యాటరింగ్ వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం బైక్‌పై తెల్లాపూర్ నుంచి కొల్లూరు వైపు వెళ్తున్నాడు. రాజ్ పుష్ప సర్కిల్ వద్దకు రాగానే టిప్పర్ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..

- టెంపో వాహనం బోల్తా పడి ఒకరు మృతి
- 12 మందికి తీవ్ర గాయాలు, ముగ్గురు పరిస్థితి విషమం
- తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఘటన



నుజ్జునుజ్జయిన టెంపో వాహనం



డ్రైవర్ మాదయ్య మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దైవ దర్శనానికి వెళ్తుండగా టెంపో వాహనం బోల్తా పడి ఒకరు మృతి చెందారు. మరో 12 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ విషాదకర ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్‌రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కొల్లూరు ఎస్ఐ రవీందర్ కథనం మేరకు.. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన హరి కిసాన్ హజారీ బీదర్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. తిరుపతి, శ్రీశైలం వెళ్దామని తనకు తెలిసిన వ్యక్తి మాదయ్య(45) టెంపో వాహనం అద్దెకు మాట్లాడుకున్నాడు. ఆదివారం రాత్రి 10.30 గంటలకు తల్లి సునీత బాయి, అతడి భార్య శిల్పరాణి, కూతురు అనుష్క, కుమారుడు ఆయూష్, తమ్ముడు దీపక్ కిసాన్ సింగ్, అతడి భార్య అమృత, కూతురు ఆరాధ్య, చెల్లెలు హారతి, ఆమె భర్త అజయ్ సింగ్, పిన్ని జీవన్ బాయి, వారి ఇంట్లో డ్రైవర్ ధనరాజ్‌తో కలిసి ఇంటి నుంచి దైవ దర్శనానికి బయలుదేరారు. ముత్తంగి సమీపంలోకి రాగానే రింగ్‌రోడ్డు ఎక్కారు. సోమవారం తెల్లావారుజామున 2 గంటల సమయంలో తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు రింగ్ రోడ్డుపై ముందు ఉన్న వాహనాన్ని తప్పించబోయి టెంపో మొదట డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన 12 మందిని పోలీసులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. హరికిసాన్ హజారీ, కుమార్తె అనుష్క, ధన్‌రాజ్ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దర్శనానికి వెళ్లొస్తుండగా కారు ప్రమాదం

– నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొండపాక(గజ్వేల్): మంచిర్యాలలోని శివాలయంలో దర్శనానికి వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలంలోని దుద్దెడ శివారులో గల కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి ఒకే కుటుంబానికి చెందిన తన్మయి, గీత, రోహిత్ రుద్రన్స్ కలిసి కారులో ఆదివారం మంచిర్యాలలోని శివాలయంలో దర్శనం కోసం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దుద్దెడ శివారులోకి రాగానే వెనుక నుంచి మరో కారు ఢీకొట్టింది. దీంతో ముందు వెళ్తున్న ట్రాక్టరును ఢీకొడుతూ డివైడర్ దాటుకొని అవతలి వైపును కారు దూకెళ్లింది. ఈ ప్రమాదంలో తన్మయికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక 108 అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. త్రీ టౌన్ కేసు నమోదు చేశారు.